# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 04 | సంచిక : 359

పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం

నవంబర్ 22, 2025


www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యం

2లో..




- నిబంధనలు పాటించని వాటిని మూసివేయండి
- కలెక్టర్ స్నేహ శబరీష్, ఎమ్మెల్యే నాయినికి వామపక్ష విద్యార్థి సంఘాల వినతి




# ఇదేమి చోద్యం..?

వివరాలు2లో..

## వాళ్లు చేస్తే సంసారం.. వేరే వాళ్లు చేస్తే వ్యభిచారమా?

- పార్టీ ఫిరాయింపులను ప్రోత్సాహించిందే కేసీఆర్
- అభివృద్ధి కోసమే కాంగ్రెస్ తో కలిసి పనిచేస్తున్నా
- స్పీకర్ నిర్ణయం మేరకే నడుచుకుంటా
- వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం కోరా
- ఉప ఎన్నిక వచ్చినా నాదే విజయం
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పార్టీ ఫిరాయింపులను ప్రోత్సాహించిందే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పది సంవత్సరాల్లో అనేక మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారని, అందులో కొంత మందికి మంత్రి పదవులు సైతం కట్టబెట్టారని గుర్తు చేశారు. ఇప్పుడు వాళ్లే పతితలుగా మాట్లాడుతున్నారన్నారు. వాళ్ళు చేస్తే సంసారం.. వేరే వాళ్ళు చేస్తే వ్యభిచారమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న రెండు పర్యాయాలు ఎంతో మంది ఎమ్మెల్యేలను నయానా, భయానా ఒప్పించి పార్టీలోకి చేర్చుకున్నప్పుడు ఫిరాయింపులు గుర్తుకు రాలేదా అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికోసం కాంగ్రెస్ తో కలిసి పనిచేస్తున్నానన్నారు. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలపై నవంబర్ 23లోపు వివరణ ఇవ్వాలంటూ స్పీకర్ నోటీసులు ఇచ్చారన్నారు. అయితే దానిపై స్పందించేందుకు మరింత సమయం కావాలని స్పీకర్ ను కోరినట్లు తెలిపారు. దీనిపై స్పీకర్ సానుకూలంగా స్పందించారన్నారు. ఒకవేళ స్టేషన్ ఘనపూర్ లో ఉప ఎన్నికలు వచ్చినా పోటీ చేసేది కడియం శ్రీహరే.. ప్రజలు గెలిపించేది కూడా కడియం శ్రీహరినే అని ధీమా వ్యక్తం చేశారు. - వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్



8లో..

## మహిళల అభ్యున్నతే లక్ష్యం

- 'మహిళల ఉన్నతి - తెలంగాణ ప్రగతి' కార్యక్రమంలో భాగంగా చీరల పంపిణీ
- వర్చువల్ గా ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ

2లో..



## నిరాశ్రయుల సమాచారాన్ని పక్కాగా నమోదు చేయాలి


- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- నిరాశ్రయ కేంద్రం సందర్శన



8లో..

## కమిషనరేట్ కు రెండో మొబైల్ ఫోరెన్సిక్ వాహనం

☐ ప్రారంభించిన సీపీ సన్ ప్రీత్ సింగ్

# ఇదేమి చోద్యం..?



- వాళ్లు చేస్తే సంసారం.. వేరే వాళ్లు చేస్తే వ్యభిచారమా?
- పార్టీ ఫిరాయింపులను ప్రోత్సాహించిందే కేసీఆర్
- అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నా
- స్పీకర్ నిర్ణయం మేరకు నడుచుకుంటా
- వివరణ ఇచ్చేందుకు మరికొంత సమయం కోరా
- ఉప ఎన్నిక వచ్చినా నాదే విజయం
- స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికి గత 10 సంవత్సరాలు అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే ఏరుబడిలో ఉన్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆరోపించారు. అయితే తనను నమ్ముకున్న ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతోపాటు నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే నియోజకవర్గ అభివృద్ధికి రూ.14కోట్ల నిధులు తీసుకురాగాలిగానని పేర్కొన్నారు. ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల గ్రామ శివారులో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న యూనిసిటీ వెంచర్ అభివృద్ధి, బిటీ రోడ్డు నిర్మాణానికి రూ.10కోట్లతో చేపట్టనున్న పనులకు వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్యతో కలిసి శనివారం కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు.

### అప్పుడూ పార్టీ మారారు..

బీఆర్ఎస్ అధికారంలో ఉన్న రెండు పర్యాయాలలో చాలా మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారని కడియం శ్రీహరి గుర్తు చేశారు. అందులో కొంత మందికి మంత్రి పదవులు సైతం కట్టబెట్టారని ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సాహించిందే కేసీఆర్ అని ఆరోపించారు. వాళ్ళు చేస్తే సంసారం.. వేరే వాళ్ళు చేస్తే వ్యభిచారమా అని ప్రశ్నించారు. పార్టీలో చేర్చుకునేందుకు వారు చేయని అక్రమాలు లేవన్నారు.

### స్పీకర్ నిర్ణయం మేరకు నడుచుకుంటా..

పార్టీ ఫిరాయింపుల ఆరోపణలపై నవంబర్ 23లోపు వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇచ్చారని కడియం శ్రీహరి ప్రకటించారు. ఈ మేరకు స్పీకర్ ను నేరుగా కలిసి వివరణ ఇచ్చేందుకు మరింత సమయం కావాలని కోరినట్లు వెల్లడించారు. దీనిపై స్పీకర్ సానుకూలంగా స్పందించారన్నారు. స్పీకర్ నిర్ణయం బట్టే తన నిర్ణయం ఉంటుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టం చేశారు. ఒకవేళ ఉప ఎన్నికలు వచ్చినా పోటీ చేసేది కడియం శ్రీహరే.. ప్రజలు గెలిపించేది కడియం శ్రీహరినే అని ధీమా వ్యక్తం చేశారు.

### నాలుగు లైన్ల బిటీ రోడ్డు..

యూనిసిటీ వెంచర్ వరకు నిర్మించే నాలుగు లైన్ల బిటీ రోడ్డును ఉనికిచర్ల గ్రామం వరకు పొడిగించాలని కడియం శ్రీహరి కోరారు. ఇదే ప్రాంతంలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం రాబోతుందన్నారు. బీసీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న క్రికెట్ స్టేడియంతో గణనీయమైన అభివృద్ధి జరగనుందన్నారు. భవిష్యత్ లో ఈ రహదారిని ఉనికిచర్ల నుంచి రాపాకపల్లి, దేవునూరు గుట్టల వరకు నిర్మించనున్నట్లు తెలిపారు. దేవునూరు గుట్టలను ఎకో టూరిజం స్పాట్ గా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు వెల్లడించారు. పట్టణ ప్రాంత ప్రజలకు హాలీడే లలో సేద తీరేందుకు ఆక్సిజన్ పార్కులు, ట్రెక్కింగ్, రాత్రి బస చేసేందుకు రిసార్ట్ వంటి సదుపాయాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల నియోజకవర్గ ప్రజల పక్షాన కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డికి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కి అభినందనలు తెలిపారు.

### అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి..

ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అందరి సహకారంతో వరంగల్ నగర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే నగరానికి ఏయిర్ పోర్ట్, కోచ్ ఫ్యాక్టరీ, టెక్స్ టైల్ పార్క్, స్పోర్ట్స్ స్కూల్ తో పాటు నగర ప్రజల ఎన్నో ఏళ్ల కల అయినటువంటి అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణం, తదితర అభివృద్ధి పనులకు రూ.4వేల కోట్లు మంజూరు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాలకు సమప్రాధాన్యం ఇస్తూ ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్, కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్ పాయ్, కుడా అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యం

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న హనుమకొండ జిల్లా పరిధిలోని ప్రైవేటు విద్యాసంస్థలను తక్షణమే మూసివేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలు స్కూల్ బోర్డులపై ఐఐటి, నీట్, డీజీ, ఒలంపియాడ్, ఇ–టెక్నో, స్మార్ట్, ఇంటర్నేషనల్, పబ్లిక్, ప్రైమ్ లాంటి తోక పేర్లు తగిలించుకొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి సంవత్సరం 10 నుంచి 15 శాతం ఫీజులను ఎఫ్ఆర్ సీతో సంబంధం లేకుండా ఇష్టా రీతిలో ఫీజులు పెంచుకుంటూ అడ్మిషన్, పరీక్ష, కంప్యూటర్, లైబ్రరీ, స్పోర్ట్స్, డెవలప్మెంట్, లాంటి రకరకాల ఫీజుల పేరుతో విద్యార్థులను తల్లిదండ్రులను నిలువునా దోచుకుంటున్నారన్నారు. ట్రస్ట్ లు, సొసైటీల పేరుతో నడిపే ఈ పాఠశాలల్లో సంబంధిత అధికారులు ఆడిట్ చేయకపోవడంతో కోట్ల రూపాయల బ్లాక్ దందాలకు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పాల్పడుతున్నాయన్నారు. తక్షణమే సంబంధిత విద్యాశాఖ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ పాఠశాలల్లో వసూలు చేసిన ఫీజులన్నింటిపై ఆడిట్ చేయించాలని డిమాండ్ చేశారు. వీటిని ప్రశ్నించడానికి వెళ్లే విద్యార్థి సంఘాలను, సామాజిక కార్యకర్తలను, జర్నలిస్టులపై ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు వారి ఇష్టా రీతిన దుర్భాషలాడుతూ దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నప్పటికి సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులు ఎక్కడో ఒక పాఠశాలను సీజ్ చేసి చేతులు దులుపుకునే పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకట్ రెడ్డి, ఏఐఎఫ్ డిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎస్ బి రాష్ట్ర కార్యదర్శి హకీమ్ నవీద్, ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాష బోయిన సంతోష్, పీడీఎస్ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు, ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్, ఏఐఎఫ్ డీఎస్ హనుమకొండ జిల్లా కార్యదర్శి మాస్ సావిత్రి, అధ్యక్షులు స్టాలిన్, పీడీఎస్ యూ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్, అధ్యక్షులు వంశీ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జు జ్యోతి, పీడీఎస్ యూ జిల్లా నాయకులు వంశీ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బొచ్చు కళ్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బీరెడ్డి జస్వంత్, శ్రీపతి వినయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు బండి లావణ్య, నగరారపు అనూష, పీడీఎస్ యూ జిల్లా నాయకులు ముషారాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# నిరాశ్రయుల సమాచారాన్ని పక్కాగా నమోదు చేయాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- నిరాశ్రయ కేంద్రం సందర్శన

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పట్టణ నిరాశ్రయుల సమాచారాన్ని పక్కాగా నమోదు చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. పట్టణ నిరాశ్రయులను గుర్తించడానికి కొనసాగుతున్న సర్వేతో పాటు రాత్రి కొనసాగుతున్న స్వీపింగ్ మిషన్ ల పనితీరును పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పట్టణ నిరాశ్రయులను గుర్తించడానికి సర్వే కొనసాగుతున్న దృష్ట్యా హనుమకొండ చౌరస్తా, వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో కమిషనర్ సర్వే నిర్వహణ తీరును పరిశీలించి మాట్లాడుతూ ఎలాంటి ఆవాసం లేకుండా ఉన్న వారిని సర్వేలో నమోదు చేయడంతో పాటు బల్దియా నిర్వహిస్తున్న షెల్టర్ హోమ్ లకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రతాప్ నగర్ లోని నిరాశ్రయ కేంద్రాన్ని కమిషనర్ తనిఖీ చేశారు. గత 18 నెలలుగా స్వీపింగ్ మిషన్లు పని చేయకపోవడంతో ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఇతర ఏజెన్సీ కి టెండర్ జారీ చేసి ఇటీవలనే వాటికి మరమత్తులు పూర్తి చేశారు. దీంతో వాటి పని తీరును తెలుసుకోవడానికి కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి మిషన్ ల పనితీరును పరిశీలించి స్వీపింగ్ మిషన్ల సామర్థ్యం పెంచాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రధాన రహదారుల వెంబడి రాత్రి వేళలో సిబ్బంది నిర్వహిస్తున్న స్వీపింగ్ తీరును పరిశీలించి మాట్లాడుతూ రాత్రి వేళలో దుకాణ దారులు చెత్తను బయట వేయకుండా చూడాలన్నారు. వారు ఏర్పాటు చేసుకున్న డబ్బాలోనే చెత్తను వేసి బల్దియాకు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, సానిటరీ సూపర్ వైజర్ గోల్కొండ శ్రీను, టీఎంసీ రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.



# నిబంధనలకు విరుద్ధంగా వైన్ షాపులు

**◆ బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్**



**వరంగల్ వాయిస్, పరకాల:** పట్టణంలో వైన్స్ షాపులు నిబంధనలకు విరుద్ధంగా, ముఖ్యంగా గ్రామదేవత ఆలయానికి అతి సమీపంలో, పాఠశాలకు 80 మీటర్ల లోపే ఏర్పాటు చేశారని భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎక్సైజ్ అండ్ ప్రొవిషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కి బీజేపీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గాజుల నిరంజన్ మాట్లాడుతూ పరకాల పట్టణ గ్రామదేవతలైన కనకదుర్గమ్మ, మదన పోచమ్మ దేవాలయాలకు వందల సంవత్సరాల చరిత్ర ఉందని తెలిపారు. పట్టణంలోని అనేక కులాల వారికి ఇలవేల్పుగా ఉన్న ఈ దేవాలయంలో అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు, నిత్య అన్నదానాలు, నిత్య హోమాలు అంగరంగ వైభవంగా నిర్వహించే సాంప్రదాయం ఉందని పేర్కొన్నారు. ఇంతటి ప్రత్యేకత కలిగిన దేవాలయానికి కేవలం 20 మీటర్ల దూరంలో, కేఎం బ్రిడ్జి పాఠశాలకు 80 మీటర్ల లోపల వైన్స్ ఏర్పాటు చేయడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని, ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని ఆయన అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన శివ వైన్స్‌ను అక్కడి నుంచి దూరంగా తరలించి భక్తుల మనోభావాలను, ఆలయ పవిత్రతను కాపాడాలని, ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసిన వినియోగదారులు అట్టి మద్యం సీసాలను గుడి ప్రాంగణంలో తాగుతూ ఆలయాన్ని అపవిత్రం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది శాంతి భద్రతల సమస్యగా తలెత్తడానికి ముందే తగు చర్యలు తీసుకొని, వైన్స్‌ను ఆలయానికి దూరంగా ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ పరకాల పట్టణ శాఖ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు దేవునూరి మేఘనాథ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, నాయకులు కుక్కల విజయ్ కుమార్, దంచనాదుల సత్యనారాయణ, మిడిదొడ్డి నరేష్, నాగెల్లి రంజిత్, దార్న సునీల్, ముత్యాల దేవేందర్, సారంగ నరేష్, సందీప్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ఆకట్టుకుంటున్న నవచేతన పుస్తక ప్రదర్శన



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** నవచేతన (విశాలాంధ్ర) పుస్తక ప్రదర్శన హనుమకొండలోని మెయిన్ రోడ్‌లోని అశోక కాంప్లెక్స్‌లో పలువురిని విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఈ నెల 5న ప్రారంభమైన ఈ ప్రదర్శన, పాఠకుల ఆదరణతో నిరాటంకంగా కొనసాగుతోంది. గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో ప్రముఖ రచయితల పుస్తకాలు కొలువుదీరాయి. వరంగల్ మహానగరంలోని రచయితలు, మేధావులు, విద్యార్థులు, వివిధ విద్యా సంస్థల ప్రతినిధులు ఈ ప్రదర్శనను సందర్శించి, పుస్తకాలను విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నవచేతన హనుమకొండ బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శన ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని తెలిపారు. ప్రముఖ ప్రచురణ సంస్థల, కవులు, రచయితల పుస్తకాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రదర్శనలో 10 నుంచి 40 శాతం తగ్గింపు ధరలతో పుస్తకాలను విక్రయిస్తున్నట్లు నాగరాజు వెల్లడించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రంథాలయాలు, పాఠశాలలు, కళాశాలల వారు, అలాగే పుస్తక ప్రియులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# పంచాయతీ ఎన్నికల నిర్వహణపై పునరాలోచన చేయాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, బీసీలకు రాజ్యాంగబద్ధంగా 42 శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి బీసీలకు చేసిన వాగ్దానాన్ని తుంగలో తొక్కి, రిజర్వేషన్లు 50% మించకుండా జీవో నెంబర్ 46 విడుదల చేయడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు బీసీ డిక్లరేషన్ ప్రకటించి, శాసనసభలో బీసీలకు విద్యా, ఉద్యోగ రంగాలలో, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లులు ఆమోదించి కేంద్రానికి పంపించింది బీసీలను మభ్యపెట్టడానికేనా అని వెంకట్రాములు ప్రశ్నించారు. ప్రధానమంత్రిపై ఒత్తిడి తేవడానికి అన్ని రాజకీయ పార్టీల బీసీ సంఘాల ప్రతినిధులతో అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామన్న ముఖ్యమంత్రి మాట తప్పడంలో ఆంతర్యం ఏమిటో తెలిసిందేనన్నారు. శాసనసభలో బలపరిచిన బీజేపీ కేంద్రంలో వ్యతిరేకించడం దాని నైజాన్ని తెలియజేస్తున్నదన్నారు. ఈ పరిస్థితులలో బీసీలు చైతన్యంతో సంఘటితమై విద్యా, ఉద్యోగ రంగాలలో, స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లతో పాటు దేశవ్యాప్తంగా కులగణన, చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లో బీసీ కోటా, సకల రంగాలలో మేమెంతో మాకంతా నినాదంతో నిరంతరం పోరాటాలకు సిద్ధం కావాలని, బీసీ ద్రోహులకు తగిన గుణపాఠం చెప్పాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు.

# మారేడుమిల్లి ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి

**■ న్యూ డెమోక్రసీ నేతల డిమాండ్**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 18, 19 తేదీలలో మారేడుమిల్లి అడవుల్లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ నాయకులు శనివారం కాశిబుగ్గ జంక్షన్‌లో ధర్నా చేశారు. సుమారు 15 నిమిషాలకు పైగా జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ–అమిత్ షా ప్రభుత్వం మధ్యభారతంలో హత్యాకాండ చేస్తోందని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ చంద్రబాబు ప్రభుత్వం కుమ్మక్కై నిరాయుధులుగా ఉన్న మావోయిస్టు పార్టీ నాయకులు హిడ్మా టెక్ శంకర్‌తో పాటు 13 మందిని ఆంధ్రప్రదేశ్‌లో అరెస్టు చేసి, అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపివేశారని వారు ఆరోపించారు. అడవి ప్రాంతంలో ఉన్న ఖనిజ, సహజ సంపదలను సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలకు, దేశ బడా కార్పొరేట్లకు అప్పగించడం కోసమే ఈ నరమేధాన్ని చేస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 5, 6వ షెడ్యూళ్లను ఉల్లంఘించి, ఆదివాసీ హక్కులను హరించి ఈ దారుణానికి పాల్పడుతున్నారని వారు అన్నారు. 'ఆపరేషన్ కగార్'ను ఆపేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్, గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి బండి కుమార్, పిడిఎస్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుర్రం అజయ్, మరి మహేష్, పివైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు గంద్రతి హరిబాబు, కరుణాకర్, చేరాలు, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇజ్జగిరి దేవేందర్ ప్రజాపతి



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ జిల్లా శాలివాహన కుమ్మరి సంఘం నూతన అధ్యక్షుడిగా కమలాపూర్ మండలం దేశరాజుపల్లికి చెందిన ఇజ్జగిరి దేవేందర్ ప్రజాపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి బాలకృష్ణ ప్రజాపతి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. దేవేందర్ ప్రజాపతి కుమ్మరి సమాజ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ ప్రజాపతి తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఇజ్జగిరి దేవేందర్ ప్రజాపతి మాట్లాడుతూ, తనపై నమ్మకంతో హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్న రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మరి బాలకృష్ణ ప్రజాపతి, రాష్ట్ర గౌరవ సలహాదారులు, తొలి రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస ప్రజాపతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉరిటి వెంకట్రావు ప్రజాపతి, ప్రధాన కార్యదర్శి లెలిజాల పావని ప్రజాపతులకు, నాయకులకు, కుల బాంధవులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందికొండ వేణుగోపాల్ ప్రజాపతి, రాష్ట్ర నాయకులు ఆవునూరి రామ్మూర్తి ప్రజాపతి, కుమ్మరి యాదగిరి ప్రజాపతి, నాంపల్లి ప్రభాకర్ ప్రజాపతి, నేదునూరి రాజేందర్ ప్రజాపతి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రుద్రారపు కుమార స్వామి ప్రజాపతి, వేములపల్లి కవిత ప్రజాపతి, లింగాల చిత్తరంజన్ ప్రజాపతి, రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సత్యసాయి శత జయంతి



**వరంగల్ వాయిస్, వరంగల్:** సత్య సాయిబాబా శత జయంతి సందర్భంగా, శివనగర్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్, న్యాయవాది శామంతుల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ సత్య సాయిబాబా సేవలను, ప్రేమ తత్వాన్ని విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. మానవత్వం, దయ, ప్రేమ ప్రతి వ్యక్తి కలిగి ఉండాలని ఆయన బోధించారని గుర్తు చేశారు. అనంతరం, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తోట సంపత్ కుమార్, మనోజ్ కుమార్ గౌడ్, రాంచంద్ర రెడ్డి, కుమార్, వరలక్ష్మి, రజని, ఉషశ్రీ, జయ, రమ తదితరులు పాల్గొన్నారు.

# "కలివి వనం" చిత్రం విద్యార్థులకు ప్రకృతిపై అవగాహన పెంచుతుంది

**సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** విద్యార్థులకు విద్యతో పాటు ప్రకృతి పట్ల అవగాహన పెంచి, చిన్ననాటి నుంచి చెట్లను నాటడమే గాక వాటిని పరిరక్షించే బాధ్యత కూడా వారిదేనని, వనాలు మన పాలిట వరాలు అనే సందేశాన్ని "కలివి వనం" చిత్రం ఇస్తుందని ప్రముఖ సామాజికవేత్త, ప్రకృతి ప్రేమికులు నిమ్మల శ్రీనివాస్ అన్నారు. రసాయనాలు వాడి పండించిన పంటలు మానవ శరీరానికి హానికరం చేస్తాయని, అదే సేంద్రియ పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని చేయాలని సందేశాన్ని కూడా దర్శకులు చిత్రంలో అద్దం పట్టేలా చూపాలని ఆయన అభిప్రాయపడ్డారు. వనాల్ని పెంచడమే కాక వాటిని రక్షించుకునే బాధ్యత కూడా ప్రజలందరిపై ఉందని చిత్రంలో అద్భుతంగా చిత్రీకరించాలని కోరారు. ఇందులో నటించిన బాల నటుల నటన అద్భుతంగా ఉందని, ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని చూసి ప్రోత్సహించాలని ఆయన అన్నారు. పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక రాయితీపై ఈ చిత్రాన్ని ప్రదర్శించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ కోరారు.

# పున్నం చందర్ ఆధ్వర్యంలో ఘనంగా దాస్యం జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పశ్చిమ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ జన్మదిన వేడుకలు శనివారం 5వ డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పండగ సాగర్, తాడిశెట్టి రాము, అరవింద్ ప్రభాకర్, దాసరి సమ్మన్న, గొర్రె విజయ్, లింగాల జనార్దన్, రమేష్ నాయక్, రఘు, నారాయణగిరి రాజు, మూల ప్రభాకర్, లాలు, మహిళా అధ్యక్షురాలు లతా, శ్రీముఖి మౌనిక, శ్రీలత, రామ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని కొయ్యూరులో తాడిచెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. నిబంధనలకు అనుగుణంగా ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర, బోనస్ పొందాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, ఏఓ శ్రీజ, ఏఈఓ అనూష, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లకావత్ సవేందర్, మంథని మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డం పోచయ్య, పీఏసీఎస్ కో–ఆప్షన్ మెంబర్ కటకం శ్రీనివాస్, హమాలీ కార్మికులు, రైతులు పాల్గొన్నారు.

# వ్యాపారుల లైసెన్స్ లేకుండా కొనుగోలు చేయరాదు

## మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి హెచ్చరిక



**వరంగల్ వాయిస్, పరకాల :** స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోకి వచ్చే పరకాల పట్టణం, పరకాల మండలం, నడికూడ మండలం, శాయంపేట మండలం పరిధిలోని పత్తి, మొక్కజొన్న కొనుగోలు చేసే ఖరీదుదారులందరికీ మార్కెట్ లైసెన్స్ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి వివరించారు. శనివారం ఆయన మాట్లాడుతూ మార్కెట్ ఖరీదు లైసెన్స్ లేకుండా రైతుల దగ్గర, రైతులు పండించిన పంటను కొనుగోలు చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఇప్పటికే చాలా సమయం ఇవ్వడం జరిగిందని, కొందరు లైసెన్స్ తీసుకున్నారని, మరికొందరు తీసుకోలేదని అన్నారు. ఇంకా లైసెన్స్ లేకుండా కొనుగోలు చేసే వ్యాపారస్తులు ఎవరైతే ఉన్నారో వారికి వారం రోజుల సమయం ఇవ్వడం జరిగిందని, ఈ వారం రోజుల్లోగా లైసెన్స్ అప్లై చేసుకోని ఎడల వారిపై చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. వ్యాపారులకు ఎటువంటి సహాయం కావాలన్నా మార్కెట్ వ్యవస్థ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, చెల్లించే బ్యాంక్ గ్యారంటీని కూడా తగ్గించడం జరిగిందని రాజిరెడ్డి తెలిపారు. వారం రోజుల్లోగా లైసెన్స్ లేకుండా కొనుగోలు చేసే వ్యాపారస్తులు, కొనుగోలుదారులు దయచేసి మార్కెట్ చట్టాన్ని గౌరవించి, మార్కెట్ కొనుగోలు లైసెన్స్ తీసుకోవాలని ఆయన కోరారు. లేనిచో వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని, మార్కెట్ వ్యవస్థను గౌరవించి, మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రైతులకు, రైతు పండించిన పంట కొనుగోలు చేసే ఖరీదారులకు మార్కెట్ వ్యవస్థ ఎప్పటికీ అందుబాటులో ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు.

# తక్షణమే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

## ◆ ఏఐసీటీయూ నేత ముక్కెర రామస్వామి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని ఏఐసీటీయూ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. ఏఐసీటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరీమాబాద్ ఎస్‌బీఐ బ్యాంకు వద్ద బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయాలని జారీ చేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముక్కెర రామస్వామి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణ త్యాగాలు చేసి, పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలను, హక్కులను బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాలరాస్తూ వస్తోందని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి, నిన్నటి నుండి వాటిని అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేయడం కార్మికులకు తీరని అన్యాయమని ఆయన అన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు, యజమానులకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను తిరగదోడుతూ యావత్ కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా తయారు చేసే విధంగా ప్రయత్నాలు ముమ్మరం చేసిందని రామస్వామి పేర్కొన్నారు. ఇకనుండి కార్మికుల హక్కుల కోసం పోరాటాలు చేయకుండా అణచివేసే ధోరణిని ప్రభుత్వం అవలంబిస్తోందని ఆయన ఆరోపించారు. కార్మిక హక్కులను కాలరాస్తే కార్మిక వర్గం చూస్తూ ఊరుకోదని, హక్కులను కాపాడుకోవడం కోసం పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీయూ జిల్లా నాయకులు ఎగ్గని మల్లికార్జున్, ఎగ్గని బాబు, రామస్వామి, శివకుమార్, అడుప యాదగిరి, సోమయ్య, సారంగపాణి, కొమురయ్య, నాగార్జున, శ్యాంసుందర్, యాదగిరి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణపై సమీక్ష



**వరంగల్ వాయిస్, మల్హర్/భూపాలపల్లి :** చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పంట కాలువలకు భూసేకరణ, ఎంజాయ్‌మెంట్ సర్వే ప్రగతిపై శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఐడీఓసీ కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, మెగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట కాలువల నిర్మాణానికి ఎంత భూమి అవసరం ఉంది, ఎంత మంది రైతులు భూములు కోల్పోతున్నారు, ఎన్ని ఎకరాలు అవసరం అవుతుందనే అంశాలపై సమగ్రంగా వివరించారు. ప్రాజెక్టు ప్రగతిపై ప్రతి వారం సమీక్ష ఉంటుందని, గత వారం సమీక్షలో చేసిన సూచనల మేరకు, ఈ వారం వరకు సాధించిన పురోగతిని సమీక్షించారు. సర్వేలో ప్రభావిత గ్రామాలు, సర్వే నంబర్లు, రైతుల వారీగా భూ వివరాలు, పంటల సాగుపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పంట కాలువల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా సాగేందుకు, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎస్‌డీసీ రమేష్, ఇరిగేషన్, మహదేవపూర్, కాటారం, మల్హర్, మహాముత్తారం మండలాల తహసీల్దార్లు, మెగా కంపెనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూం ఇండ్లను తక్షణమే పంపిణీ చేయాలి




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలకేంద్రంలోని గోపాలగిరి రోడ్డు పక్కనున్న డబుల్ బెడ్రూం ఇళ్లు నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయలేదనే గత పాలకులను గద్దె దించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించారని రిటైర్డ్ టీచర్, యూటీఎఫ్ నాయకుడు బంధు నారాయణ అన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బొల్లం అశోక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా ఇళ్లను పంపిణీ చేయకుండా ఉండడం ఎంతవరకు సమంజసమని బంధు నారాయణ ప్రశ్నించారు. తక్షణమే డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ రోజు రిలే దీక్షలకు నారాయణ సంఘీభావం తెలిపారు. ఇళ్లు లేని నిరుపేదలు 7 నెలలుగా నిరసనలు తెలుపుతుంటే స్థానిక ఎమ్మెల్యే స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరి కాదన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి ఇళ్లు లేని నిరుపేదలకు వెంటనే ఇళ్లు పంపిణీ చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు డొనుక దర్గయ్య, జమ్ముల శ్రీనివాస్, కొమ్మనబోయిన యాకయ్య, దొమ్మటి సోమయ్య, కొమ్మనబోయిన పుష్ప, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఎండీ అమీర్, డబుల్ బెడ్‌రూం ఇండ్ల పోరాట కమిటీ లీడర్లు శోభ, వరలక్ష్మి, అరుణ, షమీన, అమీన, రాధ, మంజుల, శ్రీలత, సాయిలు స్వరూప, సభ్యులు గడ్డల మల్లయ్య, రామగిరి రవిశంకర్, దస్తరి భాగ్య, గాజుల లక్ష్మి, ఈదురు లక్ష్మి, మోతే చైతన్య, చెడుపాక శారద, బొమ్మనబోయిన రజిత, కొలిపాక నవత, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

# ధనుక డిసైడ్ లానేవోతో అధిక దిగుబడులు

## ◆ ఏరియా మేనేజర్ వి.శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని వరకోల్ గ్రామంలో శనివారం ధనుకా పరకాల సేల్స్ మేనేజర్ జితేందర్ రెడ్డి కొట్ట ఆధ్వర్యంలో మెగా మిర్చి రైతుల అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఏరియా మేనేజర్ వి.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిర్చి పంటలో 'డిసైడ్' 500 గ్రాములు ఎకరాకు వాడటం వల్ల రసం పీల్చే పురుగులు, తెల్లదోమ, పచ్చదోమ, నల్లి, తామర పురుగు, పేనుబంక వంటి వాటిని నివారించుకోవచ్చని తెలిపారు. అలాగే, పది రోజుల తర్వాత 'లానెవో' 250 ఎంఎల్ వాడటం వలన కాయ తొలుచు పురుగు, రసం పీల్చే పురుగుల నుంచి పంటను దీర్ఘకాలికంగా సంరక్షించుకోవచ్చని వివరించారు. మిర్చి పంటలో 'లస్టర్' 384 ఎంఎల్ వాడటం వలన పంట పచ్చదనంగా ఉంటుందని, అధిక పూత, పిందె రాలుటను నియంత్రిస్తుందని శ్రీనివాస్ తెలిపారు. ఆకుమచ్చ, కాయమచ్చ, బూడిద తెగులు వంటి అన్ని రకాల తెగుళ్లను అరికట్టి, పంటను దీర్ఘకాలికంగా సంరక్షిస్తుందని ఆయన పేర్కొన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్ జితేందర్ రెడ్డి కొట్ట మాట్లాడుతూ, 'వెట్ సిట్'ను ప్రతి మందులో 100 మిల్లీ లీటర్లు కలిపి వాడితే, మొక్కపై ఉండే రక్షణ కవచమైన మైనపు పొరలోకి మందు సులభంగా చొచ్చుకుపోతుందని వివరించారు. దీనివల్ల పిచికారీ వ్యాప్తి మెరుగుపడుతుందని, మొక్క ఆకులు మందును త్వరగా గ్రహిస్తాయని, తిరిగి తేమను అందించడంతో పాటు పునర్వ్యాప్తి కూడా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఏరియా మేనేజర్ వి.శ్రీనివాస్, జితేందర్ రెడ్డి కొట్ట, కరీంనగర్ బీడీఓ లవన్ కుమార్, ధనుకా డాక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, స్వామి శ్రీధర్, రోహిత్, అధిక సంఖ్యలో మిర్చి రైతులు పాల్గొన్నారు.

# రైతును రాజుగా చూడటమే ప్రభుత్వ లక్ష్యం

## ◆ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, గణపురం:** రైతును రాజుగా చూడాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే గణపురం మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించారు. బుద్ధారం గ్రామంలో రూ.14 కోట్లతో రామప్ప చెరువు నుండి వంగపల్లివాని చెరువుకు పూర్తయిన ఫీడర్ ఛానల్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన గేట్ వాల్వ్‌ను తిప్పి నీటిని దిగువకు వదిలారు. భూపాలపల్లి ప్రాంత రైతాంగానికి నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా, వ్యవసాయ అవసరాల నిమిత్తం సకాలంలో నీరు అందేలా ఈ ఫీడర్ ఛానల్ అభివృద్ధి పనులను సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. రైతు సంక్షేమం తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని పేర్కొన్న ఆయన, దశాబ్దాలుగా రైతులు ఎదురుచూస్తున్న నీటి సమస్య పరిష్కారానికి ఇది పెద్ద మైలురాయి అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

### వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం..

మండలంలోని మైలారం, గాంధీనగర్, గణపురం, నగరంపల్లి, అప్పయ్యపల్లి, పరశురాంపల్లి, బసవరాజుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జీఎస్ఆర్ ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి శ్రమించి పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రజా ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి, ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరలు పొందాలని ఎమ్మెల్యే కోరారు. రైతుల సంక్షేమమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎవరూ ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా జరపాలని సంబంధిత శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నేతలు, రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా వందేమాతరం గీతాలాపన




**వరంగల్ వాయిస్, వరంగల్:** వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా, వరంగల్ నగరంలోని 36వ డివిజన్ చింతల్ ప్రాంతంలో జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ ఆధ్వర్యంలో మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మేయర్, మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రాజేశ్వర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వందేమాతరం గీతాన్ని వీనస్ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులతో పాటు కాలనీ వాసులతో కలిసి ఆలపించారు. అనంతరం రాజేశ్వర్ రావు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకట రమణ, జిల్లా నాయకులు బ్యాకం హరిశంకర్, మాచర్ల దీన్ దయాళ్, ఇనుములా అజయ్, కొంతం సంగీత్, శివనగర్ మండల అధ్యక్షులు మొహమ్మద్ రఫీ, మండల నాయకులు దుస్స శ్రీధర్, నవీన్, బంక రాజ్కుమార్, మునుపటి ఎల్లయ్య, పతి జంపయ్య, మునుపటి నవీన్, జోగు మధు, కొండా మహేశ్వర్, మేడిశెట్టి శివకుమార్, ఆకారపు షేకర్, పుప్పాల శ్రీనివాస్, బల్లనే లోకేష్, భాను, దేశభక్తులు, కాలనీ ప్రముఖులు రాజు, గోపగాని శంకర్, వేల్పుల రమేష్, మహమ్మద్ రజియా సుల్తానా, బొజ్జ మురళి, బోళ్ల యాదగిరి, సతీష్, హనంకొండ స్వామి, పెసారు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్ సమీపంలో మద్యం దుకాణాలు వద్దు

## మహిళలు, ప్రయాణికుల డిమాండ్

## అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు



**వరంగల్ వాయిస్, దామెర :** మద్యం దుకాణాలు మహిళలు సంచరించే ప్రదేశాలలోనూ, పాఠశాలలకు, దేవాలయాలకు సమీపమున ఉండకూడదనే నిబంధనలు కచ్చితంగా ఉన్నప్పటికీ, ఆచరణలో అధికారుల నిర్లక్ష్యం మూలంగా గ్రామాలలో విచ్చలవిడిగా, ఇష్టారీతిలో బెల్ట్ షాపులను నిర్వహిస్తుండటం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. ఇలాంటి సంఘటనే దామెర మండలంలోని ఓగ్లాపూర్ జాతీయ రహదారికి ఆనుకొని బస్టాండ్ సమీపంలో బెల్ట్ షాపు నిర్వహిస్తుండడంతో బస్సుల కోసం ప్రయాణించే మహిళలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులు అనేకమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు కొందరు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం సమీపంలోని మూడు గ్రామాల ప్రజలు ప్రయాణించే బస్టాండ్ కావడంతో, పక్కనే ఉన్న బెల్ట్ షాపు నిర్వహణ వల్ల తాగిన మైకంలో పలువురి మహిళలను వేధించిన సంఘటనలు కూడా ఉన్నట్లు కొందరు తెలుపుతున్నారు. ఈ సంఘటనపై సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని అక్కడి నుంచి బెల్ట్ షాపును తీసివేయాలని మహిళలు, ప్రయాణికులు కోరుతున్నారు.

# పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

## ◆ జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**వరంగల్ వాయిస్, మల్హర్/భూపాలపల్లి :** పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో 10వ తరగతి ఫలితాలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు నమోదు, యుడైస్, ఆధార్, అపార్ జారీ, పాఠశాలల్లో సౌకర్యాల కల్పన తదితర అంశాలపై మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం జిల్లా 93.55 శాతం ఫలితాలు సాధించిందని, ఈ సంవత్సరం నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల ప్రగతిని మెరుగుపరచడానికి ప్రతి పాఠశాలలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల ముఖ గుర్తింపు హాజరు ప్రస్తుతం 68.30 శాతం మాత్రమే ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల హాజరు తక్కువగా ఉంటే విద్యార్థుల హాజరు ఎలా పెరుగుతుందని ప్రశ్నించారు. విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు 62 శాతంగా ఉండటంతో, దీన్ని పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్లస్టర్ స్థాయి సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించి, వివరాలను తప్పనిసరిగా పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

# నెక్ ఎగ్ కార్ట్ బండి పంపిణీ



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని అన్నారం గ్రామంలో గాడిపెల్లి యాకేశ్వరి కుటుంబానికి శనివారం ఎర్రబెల్లి ప్రదీప్ రావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్ రావు ఆధ్వర్యంలో నెక్ ఎగ్ కార్ట్ బండి పంపిణీ చేసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు ఈ ట్రస్ట్ తగిన ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఇరు పార్టీల నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# దాస్యం జన్మదినం సందర్భంగా అన్నదానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ జన్మదిన సందర్భంగా శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 29వ డివిజన్, 11వ డివిజన్ బీఆర్ఎస్ పార్టీల ఆధ్వర్యంలో ఈ అన్నదానం జరిగింది. దాస్యం వినయ్ భాస్కర్ మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉన్నత పదవులు పొందాలని కోరుతూ శ్రీ భద్రకాళి అమ్మవారి సన్నిధిలో 29వ డివిజన్ మహిళా నాయకురాలు కొడకండ్ల సరిత అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 29వ డివిజన్ అధ్యక్షులు కొడకండ్ల సద్దాంత్, తాళ్లపల్లి రమేష్, విరాచర్ల జగన్, గట్టు చందు, బొమ్మ కంటి క్రాంతి, మాల్వరాజు, వాసు, నక్క సన్నీ, ఎండీ జావిద్, కూనమల్ల మంజుల, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జీడబ్ల్యూఎంసీ డీఈగా డి.సంతోష్ కుమార్

## శుభాకాంక్షలు తెలిపిన మరుపల్ల రవి



**వరంగల్ వాయిస్, వరంగల్:** వరంగల్ మహానగర పాలక సంస్థలో ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్‌లో అనేక సంవత్సరాలు ఏఈ (అసిస్టెంట్ ఇంజినీర్)గా పనిచేసిన డి.సంతోష్ కుమార్ ఇటీవల పదోన్నతి పొంది డీఈ (డివిజనల్ ఇంజినీర్)గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా కరీమాబాద్ వార్డ్ ఆఫీసులో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి శాలువా కప్పి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మరుపల్ల రవి మాట్లాడుతూ వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల ఎలక్ట్రికల్ సంబంధించిన విషయాలు డి.సంతోష్ కుమార్‌కు పూర్తిగా తెలుసునని, అటువంటి వారి సేవలు చాలా అవసరమని అన్నారు. రాబోవు రోజులలో సంతోష్ కుమార్ ఉన్నతమైన హోదాలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఎలక్ట్రికల్ ఏఈ జి.నరేష్, ఇతర ఎలక్ట్రికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన ఎంపీడీఓ



**వరంగల్ వాయిస్, దామెర :** మండలంలోని ఓగ్లాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోగల డంపింగ్ యార్డును, వర్మీ కంపోస్ట్ బెడ్‌లను ఎంపీడీఓ రంగాచారి శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన వర్మీ కంపోస్ట్ ఉత్పత్తులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్ పాల్గొన్నారు.


## ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ



**వరంగల్ వాయిస్, జమ్మికుంట:** మహిళా సోదరీమణులను అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే తెలంగాణ ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఉప్పల సాంబశివరెడ్డి అన్నారు. శనివారం జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామానికి తెలంగాణ ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను మడిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళా సోదరీమణులకు అందజేశారు. ఈ సందర్భంగా చీరలు తీసుకున్న మహిళా సోదరీమణులు ఇంత మంచి చీరలు అందజేసిన తెలంగాణ ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి అంజిరెడ్డి, ఇందిరా క్రాంతి పథకం సీఏలు బోనగాని ప్రియాంక, పరమేశ్వరి, మడిపల్లి గ్రామ శాఖ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రామిడి సూర్యతేజారెడ్డి, మహిళా సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సాదా బై నామాలను వేగవంతంగా పూర్తి చేయాలి

### పరకాల ఆర్డీఓ నారాయణ



**వరంగల్ వాయిస్, దామెర :** సాదా బై నామాలను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని పరకాల ఆర్డీఓ నారాయణ అన్నారు. శనివారం దామెర ఎమ్మార్వో కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, పలు విషయాలపై ఎమ్మార్వోను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అమలు చేస్తున్న సాదా బై నామాలను ఆయా గ్రామాల జిపిఓలు (గ్రామ పంచాయతీ అధికారులు) దరఖాస్తు చేసుకున్న రైతుల భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిసర ప్రాంతాల రైతుల వాంగ్మూలాలను తీసుకొని పూర్తి పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవి పాల్గొన్నారు.

## కరీమాబాద్ కురుమల విహారయాత్ర



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ నగరంలోని కరీమాబాద్ కురుమవాడలో గల శ్రీ వెంకటేశ్వర పరపతి సంఘం సభ్యులు ఈ నెల 19 నుంచి విహారయాత్రకు బయలుదేరి మురుడేశ్వర్, గోకర్ణం, శృంగేరి, ధర్మస్థలి, కుక్కుసుబ్రహ్మణ్యం వంటి కర్ణాటకలోని పుణ్యక్షేత్రాలను సందర్శిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర పరపతి సంఘం సభ్యులైన మురికి రవి, మమత, కోరే కుమారస్వామి, భారత, మురికి రాజు, కోమల, మురికి రవి, మహేశ్వరి, కోరే సదానందం, కళావతి, కోరే నాగరాజు, రజిత, న్యాయవాది దయ్యాల సుధాకర్, గీత, బండారి రాజేశ్వర్, స్వరూప, కోరే చక్రధర్, రేణుక, కోరే నవీన్, అనూష, మార్గం నవీన్, శ్రీలత తమ కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. విహారయాత్ర ముగించుకొని ఈ నెల 24 సోమవారం ఉదయం 8 గంటలకు కరీమాబాద్‌కు చేరుకుంటామని విహారయాత్ర ఇంచార్జులు మురికి మమత, కోరే భారత తెలిపారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒక్కసారి 60 మంది సంఘ సభ్యుల కోరిక మేరకు ఈ విహారయాత్రలు కొనసాగిస్తున్నామని మమత, భారతి వివరించారు.

# ఘనంగా దాస్యం జన్మదిన వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ జన్మదిన వేడుకలు శనివారం బాలసముద్రంలోని భారత రాష్ట్ర సమితి పార్టీ హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. దాస్యం వినయ్ భాస్కర్ మొదట కుటుంబ సమేతంగా భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేక్ కటింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. టీం డీ సభ్యులు ఆర్‌కే నరేంద్ర ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల పిల్లల కోసం కొనుగోలు చేసిన నోట్‌బుక్స్, పెన్స్‌ను దాస్యం వినయ్ భాస్కర్ కి అందజేశారు. పేద విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన టీం డీ సభ్యులను వినయ్ భాస్కర్ అభినందించారు. బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షులు బైరపాక ప్రశాంత్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ ఎదుట కేక్ కటింగ్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. టపాసులు





కాల్చి వేడుకలు చేసుకున్నారు. చారిత్రాత్మక వేయి స్తంభాల దేవాలయంలో పులి రజినీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రుద్రేశ్వరుడికి దాస్యం వినయ్ భాస్కర్ పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వారు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఓరుగల్లు ప్రజలకు సేవ చేయాలని ప్రార్థనలు చేసి, దాస్యం వినయ్ భాస్కర్ గారి గోత్ర నామాలతో అర్చన, అభిషేకాలు నిర్వహించారు. 30వ డివిజన్ బాలసముద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు దొమకుంట్ల సంతోష్ నగరంలో నిరాశ్రయులైన వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. 29వ డివిజన్ అధ్యక్షులు సదాంత్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కాజీపేటలో కార్పొరేటర్ సంకు నర్సింగ్ రావు గారి అధ్వర్యంలో కాజీపేట చౌరస్తాలో వినయ్ భాస్కర్ గారి జన్మదిన వేడుకలను నిర్వహించారు. 5వ డివిజన్ అధ్యక్షులు పున్నం చందర్ ఆధ్వర్యంలో కొత్తురు జెండా ప్రాంతంలో కేక్ కటింగ్ చేశారు. 8వ డివిజన్ నాయకులు పానుగంటి శ్రీధర్ ఆధ్వర్యంలో హనుమకొండ చౌరస్తాలో కేక్ కటింగ్ చేశారు. విజయవాడ గుణదల చర్చి వద్ద మంద చంటి అనే వీరాభిమాని 1000 మెట్ల మోకాళ్ల యాత్ర చేసి, యేసు క్రీస్తు ప్రభువు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## గ్రామ పంచాయతీ వార్డుల రిజర్వేషన్ల ఖరారు



**వరంగల్ వాయిస్, దామెర :** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం శనివారం దామెర మండలంలోని 14 గ్రామ పంచాయతీల వార్డుల వారీగా రిజర్వేషన్లను ఖరారు చేశారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో దామెర ఎంపీడీవో గుమ్మడి కల్పన ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు తెలిపారు. గ్రామ సర్పంచుల రిజర్వేషన్లను ఆదివారం హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయంలో అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధుల సమావేశంలో లాటరీ పద్ధతిలో ఖరారు చేయనున్నట్లు ఆమె తెలిపారు.

## సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని, షాపుల యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని మామునూరు ఏసీపీ ఎన్.వెంకటేష్ సూచించారు. శనివారం పర్వతగిరి పోలీస్ స్టేషన్ నందు పర్వతగిరి మండలంలోని వర్తక సంఘాలు, వర్తకులతో గౌరవ ఏసీపీ వెంకటేష్, పర్వతగిరి సీఐ బి.రాజగోపాల్, పర్వతగిరి ఎస్సై బి.ప్రవీణ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు సీసీ కెమెరాల విశిష్టత గురించి షాపు యజమానులతో చర్చించారు. షాప్ యజమానులు కూడా సీసీ కెమెరాలు పెట్టుకొనుటకు ఆసక్తి కనబరిచారని తెలిపారు.


# ‘ఆపరేషన్ కగార్’ను వెంటనే ఆపాలి

- మావోయిస్టులతో బేషరతుగా చర్చలు జరపాలి
- సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా

**వరంగల్ వాయిస్, వరంగల్ :** ‘ఆపరేషన్ కగార్’ను వెంటనే ఆపివేయాలని, బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరపాలని, అక్రమంగా అరెస్టు చేసిన మావోయిస్టులను తక్షణమే విడుదల చేయాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా డిమాండ్ చేశారు. శనివారం శివనగర్ తమ్మెర భవన్ లో గుండె బద్రి అధ్యక్షతన జరిగిన సీపీఐ వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. షేక్ బాష్ మియా మాట్లాడుతూ ‘ఆపరేషన్ కగార్’ పేరుతో, అడవిలోని ఆదివాసులను, అటవీ సంపదలను, జంతు వైవిధ్యాన్ని కాపాడుతూ వస్తున్న మావోయిస్టులను ఊచకోత కోయడమే కేంద్రంలోని మోడీ–అమిత్ షా ప్రభుత్వాల ధ్యేయంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, రాజ్యాంగ విరుద్ధంగా హత్యలు గావిస్తూ, ప్రజలను, మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి ప్రభుత్వమే హత్యలు చేస్తూ హత్య రాజకీయాలు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ దేశంలో బీజేపీ ప్రభుత్వాన్ని ఎండగట్టకపోతే దేశ ప్రజలు దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అడవిలోని ఆదివాసీ ప్రజలను అక్కడి నుంచి ఖాళీ చేయించి, వారిని బెదిరించి, చంపి హింసకాండను కొనసాగిస్తూ, ఆ భూమిని అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి బిజెపి ప్రభుత్వం సుదీర్ఘకాలంగా ప్రయత్నం చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా ఎంతోమంది మావోయిస్టులను, ఆదివాసీ ప్రజలను, చివరికి ఆరు నెలల పసిపాపను కూడా వదిలిపెట్టకుండా హత్యలు చేస్తోందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ హత్యాకాండను, బీజేపీ ప్రజా వ్యతిరేక




తీరును ప్రశ్నించిన ప్రతి ఒక్క గొంతుకను అరెస్టు చేసి జైల్లో బంధించడం జరిగిందని, దాదాపుగా 500కు పైగా ప్రశ్నించే గొంతుకలను ఈ బిజెపి ప్రభుత్వం కటకటాల వెనకాల నెట్టిందని పేర్కొన్నారు. మావోయిస్టు అగ్రనేతలు ఎంతోమంది, ముఖ్యంగా నంబాల కేశవరావు, అడెల్లి భాస్కర్, మడావి హిడ్మా వంటి గొప్ప గొప్ప నాయకులను పట్టుకొని చిత్రహింసలు పెట్టి, కాల్చి హత్య చేసి దానిని ఎన్‌కౌంటర్‌గా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. నేడు ఈ దేశంలో మావోయిస్టులను లేకుండా అంతం చేస్తామని పార్లమెంట్‌లో సాక్షిగా అమిత్ షా శపథం చేసి అదే పనిగా మావోయిస్టులను హత్య చేస్తున్నారని, కానీ ఈ దేశంలో ఉన్న పేదరికాన్ని, ఆకలి చావులను, నిరుద్యోగతను, అసమానతలను, అరాచకాలను, మహిళల పట్ల జరుగుతున్న దాడులను, హత్యలను, మానభంగాలను తగ్గిస్తామని దానికి సంబంధించిన ఎటువంటి శపథం చేయకుండా ఉండడం సిగ్గుచేటని షేక్ బాష్ మియా తీవ్రంగా మండిపడ్డారు. ఈ బీజేపీ ప్రభుత్వాన్ని ఎండగట్టకపోతే దేశంలో ప్రజలు దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఓర్సు రాజు, పరికరాల రమేష్, ఎండీ అక్బర్ పాషా, జన్ను రవి, తాళ్ల పెల్లి జాన్ పాల్, సుంకరి భవాని, చిట్యాల సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



# మహిళలు బలహీనులు కాదు

## నటి రష్మిక మందన్నా కామెంట్స్

ప్రస్తుతం ఫుల్ ఫామ్‌లో దూసుకెళ్తున్న హీరోయిన్ రష్మిక మందన్నా, భాష ఏదైనా పట్టించుకోకుండా వరుస సినిమా ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. అదే వేగంతో విజయాలు కూడా అందిపుచ్చుకుంటూ స్టార్ హీరో రేంజ్ ఫ్యాన్‌బేస్‌ను సంపాదించుకుంది. తాజాగా విడుదలైన 'గర్ల్‌ఫ్రెండ్' సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్న రష్మిక, సినిమాలకే కాకుండా సోషల్ మీడియాలో కూడా యాక్టివ్‌గా ఉండి అభిమానులతో కంటిన్యూ టచ్‌లో ఉంటుంది. ఇటీవల ఆమె స్త్రీశక్తి గురించి ఓ ఆసక్తికరమైన పోస్ట్‌ను షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించింది. అమ్మాయిలంతా ఏకమై నిలిస్తే ఆ శక్తిని ఎవరూ ఆపలేరని ఆమె స్పష్టంగా తెలిపింది. మహిళల మధ్య ఉండే భావోద్వేగ అనుబంధం వేరే స్థాయిలో ఉంటుందని, మంచి స్నేహితురాలితో దగ్గరైతే జరగబోయే విషయాలు ముందే అర్థమైపోతాయనే ఫీలింగ్ కలుగుతుందని చెప్పింది. స్త్రీలు ఒకరికొకరు మద్దతు ఇస్తే జీవితం మరింత సులభమవుతుందని, వారు బలహీనులు కాదు, ఎంతో ప్రేమతో, బలంతో ఉండే వ్యక్తులని రష్మిక పేర్కొంది. ఎల్లప్పుడూ తనతో ఉండే స్నేహితురాళ్లకు కృతజ్ఞతలు చెబుతూ, ప్రతి ఒక్కరి జీవితంలో కూడా ఇలాంటి మంచి ఫ్రెండ్స్ ఉండాలని కోరుకుంటు న్నానని ఆమె చెప్పింది.

# నాగచైతన్య ఎన్‌సి 24 మూవీ ఫస్ట్‌లుక్

## మహేశ్‌బాబు చేతుల మీదుగా నేడు విడుదల


అక్కినేని నాగ చైతన్య విరూపాక్ష డైరెక్టర్ కార్తీక్ వర్మ దండు దర్శకత్వంలో నటిస్తోన్న చిత్రం ఎన్‌సి24. ఈ మూవీలో మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మైథలాజికల్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తోన్న ఈ మూవీ నుంచి ఇటీవలే బీటీఎస్ వీడియోను షేర్ చేస్తూ.. ఈ మూవీ టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నవంబర్ 23న లాంచ్ చేస్తున్నట్టు ప్రకటించారు. నవంబర్ 23న ఆదివారం నాగచైతన్య బర్త్ డే సందర్భంగా ఎన్‌సీ 24 టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంచ్ చేయనున్నాడని వారణాసి పోస్టర్‌లో చైతూను మహేశ్‌బాబుతో కలిసి డిజైన్ చేసిన పోస్టర్ షేర్ చేయగా నెట్టింట వైరల్ అవుతోంది.




# ఆస్కార్ ఎంట్రీ పొందిన హోమ్‌బౌండ్

ఆస్కార్ 2026' కు భారత్ తరపున అధికారిక ఎంట్రీ పొందిన చిత్రం 'హోమ్‌బౌండ్'. 'ది బెస్ట్ ఇంటర్నేషనల్ ఫీచర్' విభాగంలో సెలెక్ట్ అయిన ఈ సినిమాలో ఇషాన్ ఖట్టర్ , విశాల్ జెత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రధారులు. సెప్టెంబరులో థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం ఓటీటీ 'నెట్‌ఫ్లిక్స్' లో స్ట్రీమింగ్ అవుతోంది. 23 చిత్రాలను వెనక్కినెట్టి అకాడమీ అవార్డుకు ఎంట్రీ పొందిన 'హోమ్‌బౌండ్'లో ఏముందన్నది చర్చిస్తున్నారు. అది ఉత్తరాదిలోని ఓ గ్రామం. చందన్ కుమార్ (విశాల్ జెత్వా), మహ్మద్ షోయబ్ (ఇషాన్ ఖట్టర్) మంచి స్నేహితులు. వేర్వేరు సామాజిక వర్గాలు, మతాలకు చెందిన వారు సమాజంలో అవమానాలకు గురవుతుంటారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి, తమకంటూ గుర్తింపు పొందేందుకు ప్రయత్నాలు మొదలుపెడతారు. పోలీసు కావడమే ఇద్దరి లక్ష్యం. అలా కానిస్టేబుల్ పరీక్ష రాసినా.. ఫలితాల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో షోయబ్ ఓ కంపెనీలో ఆఫీస్ బాయ్‌గా చేరతాడు. చందన్ డిగ్రీ చదివేందుకు.. తాను ఇష్టపడిన సుధా భారతి (జాన్వీ కపూర్) చదివే కాలేజీలో జాయిన్ అవుతాడు. ఆ తర్వాత ఊహించని రీతిలో చందన్, షోయబ్ మధ్య మనస్పర్థలొస్తాయి. దానికి కారణమేంటన్నదే కథ. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన సినిమా ఇది. స్నేహం, వివక్ష, ప్రభుత్వ ఉద్యోగానికి ఉండే పోటీ, కొవిడ్ కష్టాలు.. ఇలా పలు పార్శ్వాలతో కూడిన ఈ కథను ఎవరే కోణంలో చూస్తే అదే ప్రధానాంశంగా అనిపిస్తుంది. చందన్ పాత్ర కోణంలో కుల వివక్ష, షోయబ్ పాత్ర వైపు నుంచి మతపరమైన ఇబ్బందులే ప్రధానాంశాలు. స్నేహితుల మధ్య గొడవ జరిగినప్పటి నుంచి స్టోరీ ఎమోషనల్‌గా సాగుతుంది. ఇషాన్, విశాల్ ఒకరికొకరు పోటీ పడి నటించారు. సుధా భారతిగా జాన్వీ కపూర్ కనిపించేది కొద్దిసేపే అయినా ఆకట్టుకుంటారు. 'ఆస్కార్' ఎంట్రీతోపాటు ఇటీవల జరిగిన టొరంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో రెండో రన్నరప్‌గా ఇంటర్నేషనల్ పీపుల్స్ ఛాయిస్ అవార్డునూ గెలుచుకుంది.




# ఫౌజీపై ప్రీక్వెల్ ఊహాగానాలు

ఇప్పటి వరకు రెబల్ స్టార్ 'ప్రభాస్' సీక్వెల్ మూవీస్ మాత్రమే చేశారు. రెండు భాగాలుగా వచ్చిన 'బాహుబలి' భారీ విజయాన్ని సాధించగా.. నెక్ట్స కల్కి 2, సలార్ 2 రెడీ అవుతున్నాయి. ఈ లిస్ట్‌లో రాజాసాబ్ కూడా ఉంది. అయితే ఇవన్నీ సీక్వెల్స్ మాత్రమే. ఇప్పుడు ఓ సినిమాకు ప్రీక్వెల్ ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ నటిస్తున్న సినిమాల్లో 'ఫౌజీ' కూడా ఒకటి. సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగష్టులో ఈ సినిమా రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ వారు భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. అయితే ఫౌజీ చిత్రానికి ప్రీక్వెల్ చేసే ప్లానింగ్‌లో ఉన్నారట రాఘవపూడి. ఇప్పటి వరకు వచ్చిన ఫౌజీ అవుట్ పుట్ పట్ల ప్రభాస్ చాలా హ్యాపీగా ఉన్నారట. హను వర్క్‌కు ఫిదా అవుతున్నాడట డార్లింగ్. అందుకే ఆయనతో మరో సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టుగా ఓ టాక్ ఉంది. ఇప్పుడు దాదాపుగా ప్రీక్వెల్ ఫిక్స్ అయినట్టేనని తెలుస్తోంది. అయితే ఫౌజీ రిజల్ట్‌ను బట్టి ఈ ప్రాజెక్ట్ ఉంటుందా?, ఉండదా? అనేది డిసైడ్ కానుంది. పౌజీ హిట్ అయితే ప్రీక్వెల్ ఉండే ఛాన్స్ ఉంది, లేదంటే లేదు. యుద్ధంలో పుట్టిన ప్రేమకథగా ఈ సినిమా ఉంటుందని ముందు నుంచి ప్రచారంలో ఉంది. మరి ఈసారి హను ఎలా ప్లాన్ చేస్తున్నాడో చూడాలి.

# మోహన రాగ

## మ్యూజిక్ లాంచ్ చేసిన మంచుమనోజ్

టాలీవుడ్ నటుడు మంచు మనోజ్ తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ఆరంభించారు. ఈసారి సినీ సెట్‌లో కాదు? సంగీత ప్రపంచంలోకి అడుగుపెట్టారు. ఆయన కొత్త మ్యూజిక్ లేబుల్ 'మోహన రాగ మ్యూజిక్' శనివారం అధికారికంగా లాంచ్ అయింది. చాలా ఏళ్లుగా తన మనసులో దాగి ఉన్న ఈ కల నేడు నెరవేరిందని మనోజ్ భావోద్వేగంగా వెల్లడిరచారు. ట్విటర్‌లో 'మోహన రాగ మ్యూజిక్' పేరుతో ఓ సరికొత్త సంగీత సంస్థను ప్రారంభించబోతున్నట్టు చెప్పుకొచ్చారు మంచు మనోజ్. మ్యూజిక్ అంటే తనకు ఎంతో ఇష్టమని? ఈ సంస్థ ద్వారా న్యూ యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహించనున్నట్లు చెప్పుకొచ్చాడు. 'లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. సంగీతం ఎల్లప్పుడూ నా ఎస్కేప్. నా ఎక్స్‌ప్రెషన్, నా నిజం. ఈ రోజు ఆ జర్నీ డెవలప్ అవుతోంది. నా కొత్త ప్రపంచ మ్యూజిక్ వెంచర్ ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. మోహన రాగ మ్యూజిక్? యంగ్ టాలెంట్, కరేజ్, నిర్భయమైన సృజనాత్మక కోసం నిర్మించాం అని మంచు మనోజ్ స్పష్టం చేశాడు. నటుడిగా ఎన్నో సినిమాల్లో తనకంటూ ప్రత్యేకమైన మార్క్ సంపాదించిన మనోజ్, సంగీతంపై కూడా మంచి పట్టు ఉన్న సంగతి చాలా మందికి తెలియదు. పోటుగాడు సినిమాలో 'ప్యార్ మే పడిపోయా' పాటను స్వయంగా పాడారు. కరోనా సమయంలో విడుదల చేసిన 'అంతా బాగుంటాండ్రా' పాటకు విపరీతమైన స్పందన వచ్చింది అంతేకాదు పిస్తా పిస్తా, ఎన్నో ఎన్నో, ప్రాణం పోయే బాధ వంటి పాటలకు లిరిక్స్ కూడా రాశారు.అతని స్వరంలో ఉండే సహజమైన ఎమోషన్, సంగీతాన్ని వ్యక్తీకరించే తీరు ప్రత్యేకమని ఆయన అభిమానులు అప్పుడప్పుడూ చెబుతుంటారు.



వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శనివారం, నవంబర్ 22, 2025

# మహిళల అభ్యున్నతే లక్ష్యం

- 'మహిళల ఉన్నతి - తెలంగాణ ప్రగతి' కార్యక్రమంలో భాగంగా చీరల పంపిణీ
- వర్చువల్ గా ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహిళల అభ్యున్నతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. 'మహిళల ఉన్నతి – తెలంగాణ ప్రగతి' కార్యక్రమంలో భాగంగా కోటి మంది మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి సురేఖ ప్రారంభించారు. హనుమకొండ డీసీసీబీ ఆడిటోరియంలో నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఆప్కాబ్ చైర్మన్ మర్నేని రవీందర్ రావు, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి హాజరై మహిళా సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. నాణ్యతతో చీరలు తయారు చేయించినందుకు మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావులకు కొండా సురేఖ కృతజ్ఞతలు తెలిపారు. సమ్మక్క సారలమ్మ త్యాగలగడ్డ ఓరుగల్లు అని, మహిళలు అనుకున్నది సాధిస్తారని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితో ప్రతి మహిళ ఉక్కు మహిళగా ఎదగాలన్నారు. మహిళల ధైర్యం, నాయకత్వ పటిమ, పట్టుదల దేశాభివృద్ధికి కీలకమన్నారు. మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, స్వయం సహాయక కార్యక్రమాలు మహిళలను మరింత శక్తివంతం చేయడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి సంకల్ప దిశగా సాగుతోందని స్పష్టం చేశారు. మొదటి విడతలో గ్రామీణ ప్రాంతాల్లోని 65 లక్షల మంది మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. వచ్చే మార్చి నెలలో రెండో విడతలో పట్టణ ప్రాంతం, మున్సిపాలిటీలోని 35 లక్షల మంది మహిళలకు చీరలు పంపిణీ చేస్తామన్నారు. మహిళా సంఘాల్లో సభ్యత్వం లేని మహిళలను సంఘాల్లో చేర్పించాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో పాటు 18 ఏళ్లు నిండిన దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రతి మహిళకు చీర అందించాలని మంత్రి కోరారు.



**మహిళలకు పెద్దపీట..**

ఎంపీ డాక్టర్ కడియం కావ్యగారు మాట్లాడుతూ దేశ ప్రగతి మహిళల అభివృద్ధిపైనే ఆధారపడి ఉంటుందన్నారు. ప్రభుత్వ ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట వేస్తోందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరు మీదనే అమలు చేయడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడమే కాకుండా మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాట్లు తెలిపారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు, ఆర్టీసీ బస్సులు, చిన్న మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోందన్నారు. ప్రతీ రంగంలో మహిళలను భాగస్వాములను చేస్తూ మహిళను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి మహిళలకు అండగా నిలుస్తున్నారని వెల్లడించారు.

**సేవకులుగా పనిచేస్తున్నాం..**

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నప్పటికీ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దార్శనికతతో అభివృద్ధి, సంక్షేమ పథకాల రూపకల్పన చేసుకుంటూ ముందుకెళ్తున్నామన్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తాము నాయకులుగా కాకుండా సేవకులుగా పనిచేస్తున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. మొక్కవోని ధైర్యంతో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామన్నారు. ఆకాశ రంగును నేలకు దించుతూ మహిళలకు నీలి రంగు చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,24,416 మంది సభ్యులు ఉన్నారని, కొత్తగా 42 వేల మంది సభ్యులను చేర్పించడం జరుగుతుందని, వారికి కూడా చీరల పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీవో రామిరెడ్డి, డీఆర్డీఓ, సెర్ప్ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## మావోయిస్ట్ పార్టీకి మరో షాక్

- డీజీపీ ఎదుట 37మంది లొంగుబాటు
- వారిలో కేంద్ర కమిటీ సభ్యులు ఆజాద్

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. వరుస ఎన్‌కౌంటర్ల అనంతరం తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట శనివారం 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలున్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 303 రైఫిల్స్, జీ-3 రైఫిల్స్, ఎకె47లు, భారీగా బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్దా అలియాస్ ఎర్ర ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. మిగతా 34 మంది ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్ కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు వెల్లడించారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు వీరంతా జనజీవన స్రవంతిలో కలిసేందుకు ముందుకొచ్చినట్లు డీజీపీ వెల్లడిరచారు. లొంగిపోయిన వారంతా తమ ఆయుధాలను కూడా అప్పగించినట్లు తెలిపారు. 37 మందికి తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25 వేలు అందజేశారు. ములుగు జిల్లాకు చెందిన ఆజాద్‌పై రూ.20 లక్షలు, అప్పాస్ నారాయణపై రూ.20 లక్షల రివార్డు ఉంది. వీరితోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరిపైనా కలిపి మొత్తం రూ.1.41కోట్ల రివార్డు ఉంది. ఆ మొత్తాన్ని వారికే అందజేస్తాం అని తెలిపారు. తెలంగాణకు చెందిన మరో 59 మంది మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నారన్నారు. వారిలో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, మల్ల రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, పాక హనుమంతు అలియాస్ గణేశ్, బడె చొక్కారావు అలియాస్ దామోదర్ ఉన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీలో 10 మంది ఉన్నారు. వీళ్లంతా వీలైనంత త్వరగా లొంగిపోవాలని సూచిస్తున్నాం అని డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు.

**భారత్ బంద్ కు మావోయిస్టుల పిలుపు**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మావోయిస్టు పార్టీ, తమ అగ్రనేత హిడ్మాతో పాటు పలువురిని పోలీసులు క్రూరంగా హత్య చేసి ఎన్ కౌంటర్ గా చిత్రీకరించడాన్ని నిరసిస్తూ నవంబర్ 23వ తేదీన భారత్ బంద్ కు పిలుపునిచ్చింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ విడుదల చేసిన లేఖలో ఈ వివరాలు వెల్లడించారు. పోలీసుల చర్యలకు నిరసనగా ఈ బంద్ ప్రకటించినట్లు తెలిపారు.

## సెంట్రల్ జోన్ డీసీపీగా కవిత



వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా దార కవిత నియమితులయ్యారు. హైదరాబాద్ సిటీ పోలీస్ సైబర్ విభాగం పనిచేస్తున్న దార కవిత ఐ బొమ్మ రవి కేసును దర్యాప్తు చేస్తున్నారు. కేసు విచారణలో ఉండగానే వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

**-వరంగల్ వాయిస్, క్రైం**

## కమిషనరేట్ కు రెండో మొబైల్ ఫోరెన్సిక్ వాహనం

☐ ప్రారంభించిన సీపీ సన్ ప్రీత్ సింగ్



**వరంగల్ వాయిస్, క్రైం :** నేరం జరిగి సంఘటన స్థలంలో నిందితులను గుర్తించేందుకు వీలుగా ప్రభుత్వం మంజూరు చేసిన రెండో మొబైల్ ఫోరెన్సిక్ వాహనాన్ని శనివారం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ జెండా ఊపి ప్రారంభించారు. ఫోరెన్సిక్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కు నూతనంగా మొబైల్ ఫోరెన్సిక్ రెండో వాహనాన్ని అందజేసారు. ఈ సందర్భంగా వరంగల్ సీపీ మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంతోపాటు, అత్యాధునిక పరికరాలతో రూపొందించబడిన ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనాని వరంగల్ కమిషనరేట్ పోలీసులకు మరింత మెరుగైన సేవలందించనుందన్నారు. ఇకపై ఎదైనా నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ అధికారులు, సిబ్బంది ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనంలో చేరుకొని సంఘటన జరిగిన స్థలం నుంచి రక్తపు మరకలు, వేలిముద్రలతో పాటు ఇతర సాక్ష్యాధారాలను సేకరించి ఈ మొబైల్ వాహనంలో ఏర్పాటు చేసిన అధునిక పరికరాలతో పరీక్షలను నిర్వహించి సంబంధిత దర్యాప్తు అధికారికి ప్రాథమిక సాక్ష్యాధారాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ మొబైల్ వాహనంలో విధులు నిర్వహించేందుకు ఆరుగురు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు సీపీ తెలిపారు. ఈ కార్యక్రమం డీసీపీ అంకిత్ కుమార్, గుణ శేఖర్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్, శ్రీనివాస్ తో పాటు ఏసీపీలు, ఆర్ఐలు, ఫింగర్ ప్రింట్ ఇన్స్ స్పెక్టర్లు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com